సాక్షి అనంతపురం

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.19

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.19 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

34.4°/21.2°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జీఎస్టీపై అవగాహన కల్పించాలి



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

అనంతపురం అర్బన్: జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏపీఎంఐపీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' పోస్టర్లు, స్టిక్కర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుకాణాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీ చేసి తగ్గిన జీఎస్టీ సక్రమంగా అమలు చేస్తున్నారా.. లేదా పరిశీలించాలన్నారు. తగ్గిన జీఎస్టీపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. పరిశ్రమలు, సూక్ష్మ సేద్యం, వ్యవసాయం, క్రీడా వస్తు సామగ్రి, ఎలక్ట్రానిక్, స్టేషనరీ తదితర దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేయాలని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలతో 99 శాతం వస్తువులు, సేవలు పన్నురహితంగా మారాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, ఏపీఎంఐపీడీ రఘునాథరెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి మంజుల పాల్గొన్నారు.

జిల్లాలో మరో రెండు ఎంఎస్‌ఎంఈ పార్కులు

అనంతపురం టౌన్: జిల్లాలో మరో రెండు ఎంఎస్‌ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామంలో 50 ఎకరాలు, కూడేరులో 100 ఎకరాల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు, మూడు నెలల్లో పనులు పూర్తి చేసి పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను నెలకొల్పేందుకు ఆసక్తి ఉన్న వారు ఏపీఐఐసీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇప్పటికే రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి ఎంఎస్‌ఎంఈ పార్క్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బరితెగించిన ఇసుకాసురులు

- ఇసుక అక్రమ తరలింపునకు ఏకంగా మట్టి రోడ్డు ఏర్పాటు



రాచేపల్లి వద్ద పెన్నానదిలోకి టీడీపీ నాయకులు వేసుకున్న మట్టి రోడ్డు

శింగనమల: ఇసుకాసురులు బరితెగించారు. ఇసుకను అక్రమంగా తరలించేందుకు ఏకంగా రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. వివరాలు.. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలో పలువురు టీడీపీ నాయకులు ఇసుకపై కన్నేశారు. ఇటీవల మండలంలోని రాచేపల్లి వద్ద పెన్నానదిపై వీరి కన్ను పడింది. నదిలో ఇసుక పుష్కలంగా అందుబాటులో ఉండడంతో కొల్లగొట్టేందుకు ప్రణాళికలు రచించారు. ఇసుక తరలించడానికి ఏకంగా ఎర్రమట్టితో రోడ్డు వేసుకున్నారు. అయితే, రెండు రోజుల క్రితం ఇసుకను తరలించడానికి జేసీబీతో వెళ్తున్న వీరిని రాచేపల్లికి చెందిన రైతులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని కొందరు రైతులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యింది. దీనిపై సోమవారం ఉన్నతాధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు.

కుమారుడికి పెళ్లి కాలేదని బలవన్మరణం

అనంతపురం సిటీ: వ్యక్తి ఆత్మహత్య కేసులో మిస్టరీని రైల్వే పోలీసులు ఛేదించారు. వివరాలను సోమవారం వెల్లడించారు. అనంతపురం రూరల్ మండలం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని పొట్టి శ్రీరాములు కాలనీకి చెందిన సల్లా మల్లికార్జున(59)కు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు పెళ్లి కాగా, కుమారుడికి ఎన్ని సంబంధాలు చూసినా ఏ ఒక్కటీ కుదరలేదు. దీంతో కుమారుడికి ఇక పెళ్లి కాదేమోననే బెంగతో ఈ నెల 27న అనంతపురం సమీపంలో మల్లికార్జున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో తొలుత గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడి ఆచూకీ లభ్యమైంది.

కూటమి అలసత్వం ▶ పేదలకు పెద్ద కష్టం

గ్రామీణులకు దిక్కైన పీహెచ్‌సీల్లో స్తంభించిన సేవలు

- డిమాండ్ల సాధనకు విధులను బహిష్కరించిన వైద్యులు
- తీవ్ర అవస్థలు పడిన పేద ప్రజలు
- చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు



బీకేఎస్ పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్సు



యల్లనూరు పీహెచ్‌సీలో ఖాళీగా కనిపిస్తున్న వైద్యుడి కుర్చీ

జ్వరంతో బాధపడుతూ బీకేఎస్ ఆస్పత్రికి రాగా, ఓఆర్ఎస్ ఇచ్చి పంపారని చెబుతున్న వృద్ధురాలు

అనంతపురం మెడికల్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ఓపీ సేవలు బంద్ అయ్యాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 26 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న పీహెచ్‌సీ వైద్యులు.. సోమవారం విధులను బహిష్కరించారు. ఓపీ సేవలకు దూరంగా ఉన్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. ఇలాంటి సమయంలోనే డాక్టర్లు సమ్మెకు దిగడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులకు స్టాఫ్‌నర్సులు, ఫార్మసీ సిబ్బంది పారాసిట మాల్, తదితర మందులను ఇచ్చి పంపించేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పీహెచ్‌సీలే దిక్కు. జిల్లావ్యాప్తంగా 45 పీహెచ్‌సీలు ఉండగా.. రోజూ 3 వేల మందికిపైగా ఓపీ సేవలు పొందుతున్నారు. జ్వరం, కడుపునొప్పి, తదితర ఏ చిన్న సమస్య వచ్చినా గ్రామీణులు ముందుగా పీహెచ్‌సీలకే వెళ్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ఆయా ఆస్పత్రుల్లో సేవలు పొందుతుంటారు. అలాంటి ఆస్పత్రుల డాక్టర్లు ఒక్కసారిగా కానరాకపోవడంతో పేద ప్రజలకు చుక్కలు కనిపించాయి. దీంతో వేలాది మంది అనంతపురం సర్వజనాస్పత్రి, పట్టణాల్లోని ఏరియా ఆస్పత్రులకు పరుగులు పెట్టారు. తమ డిమాండ్లను తీర్చాలని చాలా రోజుల నుంచే పీహెచ్‌సీల వైద్యులు కోరుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ క్రమంలో చంద్రబాబు సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రి కోసం పడిగాపులు..

అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సోమవారం మంత్రి సత్యకుమార్ వచ్చారన్న విషయం తెలుసుకున్న పీహెచ్‌సీల వైద్యులు ఉదయం 9 గంటలకే తరలివచ్చారు. మంత్రికి వినతిపత్రం సమర్పించేందుకు గంటల తరబడి వేచి చూశారు. కానీ మంత్రి సత్యకుమార్ పట్టుమని రెండు నిమిషాలు కూడా వారికి కేటాయించకపోవడం గమనార్హం. టైమ్ బౌండ్ పదోన్నతులు, ఇన్ సర్వీస్ పీజీ కోటా, నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ సాహిత, డాక్టర్ లోకేష్, డాక్టర్ శివసాయి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ తరుణసాయి, డాక్టర్ ఆసియా, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రీతి, డాక్టర్ సుమన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దంపతులపై టీడీపీ నాయకుల దాడి



దాడిలో గాయపడిన బండి కొండమ్మ

ఆత్మకూరు: అధికార అండతో రాప్తాడు నియోజకవర్గంలో 'పచ్చ' నేతలు రెచ్చిపోతున్నారు. తామేం చేసినా చెల్లుతుందన్న రీతిలో దాడులకు పాల్పడుతున్నారు. పాత కక్షలను మనసులో పెట్టుకుని దంపతులపై టీడీపీ నాయకులు దాడి చేసిన ఘటన ఆత్మకూరు మండలం బ్రాహ్మణ యాలేరులో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. బ్రాహ్మణ యాలేరుకు చెందిన బండి చిన్న అహోబిలం తనకు అనారోగ్యంగా ఉండటంతో సోమవారం ఉదయం అనంతపురం వెళ్లి చికిత్స చేయించుకుని సాయంత్రం గ్రామానికి వచ్చాడు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద కూర్చుని ఉండగా టీడీపీ నాయకులు శంకరయ్య, శివయ్యలు అక్కడికి వచ్చి అహోబిలంతో గొడవకు దిగారు. చెప్పులు, రాళ్లతో దాడి చేశారు. విషయం తెలిసి అహోబిలం భార్య కొండమ్మ, కోడలు సుకన్య, కుమారుడు నాగరాజు అక్కడికి చేరుకోగా వారిపైనా దాడికి దిగారు. ఘటనలో కొండమ్మకు పక్కటెముక విరిగింది. అహోబిలంకు గాయాలయ్యాయి. కుటుంబీకులు ఇద్దరినీ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని తన తల్లిదండ్రులపై దాడి చేసినట్లు బండి నాగరాజు తెలిపాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం
- 'పరిష్కార వేదిక'లో 325 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ ఆనంద్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జునుడు, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 325 వినతులు అందాయి. ఇందులో భూ సమస్యలకు సంబంధించి 250 వరకు ఉండడం గమనార్హం. కార్యక్రమానికి ముందు అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని చెప్పారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడాలన్నారు. సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు రీ-ఓపెన్ కాకూడదని స్పష్టం చేశారు.

వినతుల్లో కొన్ని..

- ఉపాధి కోసం తాము ఊరు వదిలి వెళ్లగా, భూమిని ఒక వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించాడని డీ.హీరేహాళ్ మండలం హనుమాపురం గ్రామానికి చెందిన పింజారి హుసేన్‌సాబ్ విన్నవించాడు. సర్వే నంబరు 477-బీలో తమకు 2.15 ఎకరాలు ఉందని చెప్పాడు. బతుకుదెరువు కోసం ఊరు విడిచి వెళ్లడంతో ఒక వ్యక్తి దాన్ని ఆక్రమించాడని, న్యాయం చేయాలని కోరాడు.
- తమ వ్యవసాయ భూమిని 22ఏ (నిషేధిత భూములు) జాబితాలో వేరేవారి పేరున చేర్చారని నార్పల మండలం గంగనపల్లికి చెందిన సంజీవనాయుడు విన్నవించాడు. గూగూడు గ్రామ పొలం సర్వే నంబరు 266-1ఏలో 5 ఎకరాలు 52 ఏళ్ల నుంచి తమ స్వాధీనంలో ఉందని చెప్పాడు. అయితే 22ఏ కింద వేరొకరిపై చేర్చారని, సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.
- వివాదంలో ఉన్న సర్వే నంబర్లను తొలగించాలని ఎం.భాస్కర్ విన్నవించాడు. తమకు బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామ పొలంలోని సర్వే నంబర్లు 340-1ఏ3, 370-1, 379-1,2, 380-3, 382-2ఏ అన్నీ వివాదంలో ఉన్నాయని తెలిపాడు. విచారణ చేసి తొలగించాలని విన్నవించాడు.



ఈ వృద్ధుని పేరు వి.నారాయణరెడ్డి, అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామం. వీరికి కందుకూరు గ్రామ పొలం సర్వే నంబరు 188-1లో 10.20 ఎకరాల పొలం ఉంది. అయితే ఈ భూమిని 22ఏ (నిషేధిత భూములు) జాబితాలో చేర్చారు. దీంతో భూమి రిజిస్టర్ కావడం లేదు. ఐదేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించి కాపాడాలని అధికారులను వేడుకున్నాడు.

ఇబ్బందులు పెట్టేవారిని వదలం

- ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన చంద్రబాబు ప్రభుత్వం
- సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధింపులు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్‌తో భరోసా
- పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- తండ్రికి చెడ్డపేరు తెచ్చేలా బాలకృష్ణ ప్రవర్తన: మాజీ మంత్రి శైలజానాథ్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి, శైలజానాథ్,ఎల్ఎం మోహన్‌రెడ్డి, నాయకులు

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని వదిలి పెట్టబోమని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తల కోసం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ తీసుకొచ్చారని, ఎవరికి ఏ అన్యాయం జరిగినా సమస్యతో పాటు ఇబ్బంది పెట్టిన వారి వివరాలు, ఫొటోలు, సమాచారం నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాలు నేరుగా అధినేత వైఎస్ జగన్ దృష్టికి వెళ్తాయని, ఇబ్బంది పెట్టిన వ్యక్తులు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచిన వారితో కలసి తిరగడం బాలకృష్ణకు సిగ్గుగా లేదా అని నిలదీశారు. తండ్రి పార్టీని లాక్కున్నా వాటి గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి బాలకృష్ణది కాదన్నారు. ఆయనకు ఏ సర్టిఫికెట్లు ఉన్నాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ బాలకృష్ణ చంద్రబాబు చెంత చేరి ఎన్టీఆర్ కుటుంబానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ రాష్ట్ర ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన చలువతో లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అనేక రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మహానేత తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఇళ్ల వద్దకే పథకాలు అందించారన్నారు. జగనన్నకు అందరూ తోడుగా ఉండాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఎల్ఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న కాలంలో రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అందరూ ధైర్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, పూల ప్రసాద్, మహేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి, శివ శంకర్, ఖాదర్‌వలి,జెడ్పీటీసీలు భాస్కర్,బోగాతి ప్రతాప్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు నారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మిద్దె కుళ్లాయప్ప, చామలూరు రాజగోపాల్, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ శంకర్ నాయక్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, పూల నారాయణ స్వామి, చికెన్ నారాయణస్వామి, శ్రీరామిరెడ్డి, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం



అనంతపురంలో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్/అనంతపురం సిటీ: తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునేది లేదని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అధికారుల గ్రూపు నుంచి వైదొలుగుతున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, 9 నెలల అరియర్స్ అందించాలన్నారు. వచ్చే నెల 1న యథావిధిగా సచివాలయాల్లోనే పింఛన్ పంపిణీ చేస్తామని, ఆ తర్వాత నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకలు సుధాకర్, లక్ష్మినారాయణ, వరప్రసాద్, విమల పాల్గొన్నారు.

పప్పుశనగ విత్తన కేటాయింపులు కుదింపు

- రాయితీ కూడా 40 శాతం నుంచి 25 శాతానికి తగ్గింపు
- రైతన్నలపై చిన్నచూపు ధోరణిని కొనసాగిస్తున్న 'కూటమి'
- ప్రభుత్వ అలసత్వంతో అన్నదాతలపై రూ.1.65 కోట్ల అదనపు భారం



అనంతపురం అగ్రికల్చర్: రైతులపై కూటమి సర్కారు చిన్నచూపు ధోరణి కొనసాగిస్తోంది. అరకొర విత్తనాలు, ఎరువుల కేటాయింపులతో చెలగాటమాడుతోంది. తాజాగా రబీలో ప్రధాన పంటగా పండించే విత్తన పప్పుశనగ కేటాయింపులను 14 వేల క్వింటాళ్లకు కుదించింది. విత్తన కేటాయింపులు, ధరలు, సబ్సిడీ ప్రకటిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అది కూడా మరో రెండు రోజుల్లో రబీ ప్రారంభమవుతున్న తరుణంలో ఆలస్యంగా కేటాయింపులు, ధరలు ప్రకటించింది. ఈ క్రమంలో విత్తన కేటాయింపులను గతంలో కన్నా సగానికి తగ్గించడం గమనార్హం. ఇక సబ్సిడీ కూడా 40 శాతం నుంచి 25 శాతానికి కుదించడంతో జిల్లా రైతులపై రూ.1.65 కోట్లు భారం పడే పరిస్థితి నెలకొంది. జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.7,800 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.1,950 పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,850 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

పట్టించుకునే వారు కరువు..

అన్నదాతను మొదటి నుంచి చంద్రబాబు సర్కారు ఇబ్బందులకు గురి చేస్తోంది. మొదటి ఏడాది 'సుఖీభవ' కింద రూ.400 కోట్లకు పైగా ఎగ్గొట్టిన ప్రభుత్వం రెండో ఏడాది రూ.5 వేలు ఇచ్చినా... ఇంకా వేల మందికి సొమ్ము జమ కాని పరిస్థితి. ఇక ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ కింద పెద్ద మొత్తంలో పరిహారం ఇవ్వకుండా దాటవేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న బాధిత రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదు. ఈ ఖరీఫ్‌లో కూడా విత్తన వేరుశనగ ఆలస్యంగా ఇవ్వడంతో రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఇక యూరియా పరిస్థితి ఎంత చెప్పినా తక్కువే. రైతులు నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. 'ప్రత్యామ్నాయం' ఇవ్వకుండా మోసం చేసిన చంద్రబాబు సర్కారు... తాజాగా అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రబీ రైతులకు కూడా కుచ్చుటోపీ పెట్టేందుకు పూనుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలస్యం తప్పదా...?

గతేడాది ఖరీఫ్, రబీతో పాటు ఈ ఖరీఫ్‌లో విత్తనం సరఫరా చేసిన ఏజెన్సీలకు ఏపీ సీడ్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సొమ్ము చెల్లించకుండా బకాయిలు పెట్టడంతో ఇప్పుడు రబీలో పప్పుశనగ సరఫరాకు ఏజెన్సీలు మొండికేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రబీ రైతులకు సకాలంలో విత్తన పప్పుశనగ అందడం కష్టంగానే కనిపిస్తోంది. ఖరీఫ్‌లో మాదిరిగా రబీలో ఇలాంటి పరిస్థితి ఎదురైతే పంట సాగు విస్తీర్ణంపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలవంక తొంగిచూసె..

నంది దరహాసం ఒలకబోసె



తాడిపత్రి పట్టణంలో సోమవారం సాయంత్రం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. చిరుజల్లులు కురిసి ఆకాశం మేఘావృతమైన సమయంలో నెలవంక చుట్టూ చేరిన వెలుగు చూపరులను ఆకట్టుకోగా.. అదే క్రమంలో స్థానిక పురాతన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నంది విగ్రహం చంద్రుడి వెలుగులో చూపరులను ఆకర్షించింది. – తాడిపత్రిటౌన్:

క్లుప్తంగా

ప్రభుత్వానికి కనువిప్పు కల్గిద్దాం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు



అనంతపురం కార్పొరేషన్: పేదింటి బిడ్డలకు వైద్య విద్యను వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేద్దామంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు పిలుపునిచ్చారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలను తీసుకువస్తే... కూటమి ప్రభుత్వం పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద 66 ఏళ్ల పాటు నిర్వహించుకునేలా ప్రైవేట్ పరం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలనే డిమాండ్‌తో మంగళవారం ఉదయం 11 గంటలకు అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీ ఎన్జీఓ సంఘం బలోపేతానికి చర్యలు

అనంతపురం టవర్‌క్లాక్: ఏపీ ఎన్జీఓ సంఘాన్ని బలోపేతం చేసేలా చర్యలు చేపట్టినట్లు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సంఘం బలంగా ఉన్నప్పుడే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం పది మందిని సభ్యులుగా చేయించాలన్నారు. సచివాలయ ఉద్యోగులను కూడా సంఘంలోకి ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్, చంద్రశేఖర్, వెంకటేష్ బాబు, రమాదేవి, జమీలాబేగం, సుదర్శన్ శర్మ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: రైలు కిందపడబోయిన యువకుడిని లోకో పైలెట్ సకాలంలో గుర్తించి, ప్రమాదం నుంచి కాపాడాడు. వివరాలు.. కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేష్‌కు గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల భార్య గొడవపడి పుట్టింటికి చేరుకుంది. దీంతో వెంకటేష్ సోమవారం యర్రగుంట్లకు చేరుకుని భార్యను కాపురానికి రావాలని అభ్యర్థించాడు. ఆమె నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెంది గార్లదిన్నెలోని డ్యాం రోడ్డు రైల్వే గేట్ సమీపంలో ప్యాసింజర్ రైలు కింద పడబోయాడు. గమనించిన లోకో పైలెట్ రైలు వేగాన్ని నియంత్రించడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే వెంకటేష్‌ను పట్టాల పైనుంచి పక్కకు లాగేశారు.

బరిలో దిగితే.. విధ్వంసమే!

- క్రికెట్‌లో రాణిస్తున్న జిల్లా వాసులు
- భారత మహిళా క్రికెట్ జట్టులో అనూష
- ఇప్పటికే పలువురు రంజీ జట్టుకు ప్రాతినిధ్యం
- తాజాగా దూసుకొస్తున్న మరికొందరు

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజల అభిమాన క్రీడగా మారిన క్రికెట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు రాణిస్తున్నారు. సాధారణంగా విధ్వంస రచన చేసే టీ20 ఫార్మాట్‌లో విజయాన్ని శాసించే స్థాయికి బౌలర్లు ఎదిగారు. గెలుపే ఆకాంక్షగా బ్యాటింగ్ బరిలో దిగితే పరుగుల వర్షం కురిపిస్తున్నారు.

అనంతపురం: ప్రపంచ వ్యాప్తంగా యమ క్రేజీ ఉన్న క్రికెట్‌లో అనంతపురం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తూ రంజీ, దేశవాళీ టోర్నీల్లో రాణిస్తున్నారు. ఏపీఎల్ (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) లోనూ అదరగొడుతున్నారు. పురుషులే కాదు ..మహిళలు కూడా తాము ఎందులోనూ తీసిపోమని సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా ఆర్డీటీ అందిస్తున్న శిక్షణతో రాటు దేలిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుతున్నారు.

దత్తా.. సాటిలేని సత్తా

ఆంధ్రా తరఫున అండర్–19 విభాగంలో హర్యానాపై మచ్చా దత్తారెడ్డి ఏకంగా 172 పరుగులు సాధించి రికార్డు సృష్టించాడు. మణిపూర్‌పై 105 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వికెట్ కీపర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా ప్రతిభ కనబరుస్తున్నాడు. అండర్–23లో గోవాపై 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఏపీఎల్‌లోనూ రాణించాడు. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్ మెన్‌గా సత్తా చాటుతున్నాడు.

బాల్ వేస్తే.. వికెట్ గిరగిరా..

గిరినాథరెడ్డి మంచి ఆల్‌రౌండర్. అండర్–25 విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఏపీఎల్‌లో రాయలసీమ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. కుడిచేతి బ్యాట్స్‌మెన్, మీడియం పేస్ బౌలింగ్‌తో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. అండర్–23లో మధ్యప్రదేశ్ జట్టుపై 7 వికెట్లు తీసిన రికార్డు ఉంది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన గిరినాథరెడ్డి మంచి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు దక్కించుకున్నాడు.



మల్లి బౌలింగ్‌తో ప్రత్యర్థి బెంబేలు

రాప్తాడుకు చెందిన మల్లికార్జున ఎడమ చేతి స్పిన్నర్. ఆంధ్ర తరఫున అండర్–16లో సిక్కింపై 8, గోవాపై 7 వికెట్లు కూలదోశాడు. అండర్–19 కేటగిరిలో బెంగాల్‌పై 7 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. బీసీసీఐ అండర్–16 టోర్నీలో అత్యధికంగా 38 వికెట్లు తీసిన రెండో క్రీడాకారుడిగా ఖ్యాతి దక్కించుకున్నాడు. ఏపీఎల్‌లోనూ రాణిస్తున్నాడు.

'ప్రశాంత'ంగా ఆడేస్తూ..

డీబీ ప్రశాంత్‌కుమార్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో సెంచరీ సాధించాడు. రంజీ ట్రోఫీలో 85 మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌పై ఆడిన మ్యాచ్‌లో 189 పరుగులు సాధించాడు. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అయిన డీబీ ప్రశాంత్ కుమార్ బరిలో ఉన్నంత సేపూ ప్రశాంతంగా ఆడుతూ ప్రత్యర్థి జట్టు విజయాకాశాలను దెబ్బ తీయడంలో దిట్టగా పేరుగాంచాడు.

అర్జున్.. రన్ మెషీన్

కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా అర్జున్ టెండూలక్కర్ సత్తా చాటుతున్నాడు. అండర్ –19 , అండర్–23 కేటగిరిలో రాణించాడు. సీనియర్ వన్డే అంతర జిల్లా టోర్నీలో 127 పరుగులు సాధించాడు. రెండు అర్ధసెంచరీలు చేశాడు. కుడి చేతి ఆఫ్ స్పిన్నర్‌గా ఆల్‌రౌండర్ ప్రతిభ చాటుతున్న అర్జున్ టెండుల్కర్ స్వగ్రామం ధర్మవరం మండలం గొట్లూరు గ్రామం.

బౌలింగ్ మాయాజాలం

కురుగుంట గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ డైలీ వర్కర్ రవి, ఆయన భార్య నారాయణమ్మ తాము పడుతున్న కష్టం తమ బిడ్డ వినయ్‌కుమార్ పడకూడదని భావించారు. చదువుతో పాటు క్రికెట్‌లోనూ శిక్షణ ఇప్పించారు. వారి నమ్మకాన్ని వినయ్‌కుమార్ వమ్ము చేయలేదు. 2013 నుంచి 2017 వరకు అనంతపురం క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. ఆర్డీటీ కోచ్‌లు నరేష్, ఆర్.కుమార్ వద్ద మెలకువలు నేర్చుకుని, అండర్–19, 23, 25 టోర్నీలతో పాటు రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లోనూ తిరుగులేని ప్రతిభను చాటాడు. తన బౌలింగ్ మాయాజాలంతో హజరా ట్రోఫీలో ఏకంగా 6 వికెట్లు తీసి సత్తా చాటాడు.



గిరినాథ రెడ్డి



మచ్చాదత్తా రెడ్డి



డీబీ ప్రశాంత్‌కుమార్



అర్జున్ టెండూల్కర్



వినయ్‌కుమార్



మల్లికార్జున

అనూష.. అనంత అణిముత్యం



నార్పల మండలం బండ్లపల్లి గ్రామానికి చెందిన బి.అనూష.. భారత మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆర్డీటీలోని క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. ఎడమ చేతి లెగ్ స్పిన్నర్, కుడి చేతి బ్యాటింగ్ ఆమె ప్రత్యేకత.ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తోంది. ఆంధ్రా టీ–20 టోర్నీలో ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తోంది. అత్యధిక వికెట్లు సాధించిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. భారత మహిళా జట్టులో చోటు దక్కించుకున్న తొలి జిల్లా క్రీడాకారిణిగా అనూష.. అనంత అణిముత్యంగా నిలిచింది.

వీరా.. పరుగుల వరద



అండర్–19 ఆంధ్రా జట్టు కెప్టెన్‌గా కోగటం హనీష్ వీరా రెడ్డి విశేష ప్రతిభను చాటుతున్నాడు. ఎడమ చేతి వాటం ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా బరిలో దిగితే విధ్వంసకరమైన బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా చేయగల నైపుణ్యం ఉంది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో రాయలసీమ కింగ్స్, కాకినాడ, సింహాద్రి లయన్స్ జట్లలో ప్రాతినిధ్యం వహించాడు. అండర్–19లో అత్యధికంగా పరుగులు సాధించిన క్రికెటర్‌గా ఖ్యాతి దక్కించుకున్నాడు. ఏపీఎల్ చరిత్రలో తొలి సెంచరీతో పాటు, అత్యంత వేగంగా సెంచరీ సాధించిన క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ ట్రయల్స్ జట్టు వరకూ వెళ్లాడు.

పాలకుల్లో చలనం రావాలంటే ఉద్యమాలే శరణ్యం

- 7న తలపెట్టిన 'చలో విజయవాడ – పోరుబాట' విజయవంతం చేయండి
- ఫ్యాప్టో రాష్ట్ర కోచైర్మన్ హృదయరాజు



మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర కోచైర్మన్ హృదయరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై పాలకుల్లో కదలిక రావాలంటే ఉద్యమాలే శరణ్యమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కోచైర్మన్ హృదయరాజు అన్నారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో జిల్లా ఫ్యాప్టో సన్నాహక సమావేశం జరిగింది. పరిశీలకులుగా హాజరైన హృదయరాజు మాట్లాడుతూ.. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో 72, 73, 74 జీఓలు అమలు చేయాలన్నారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. కేంద్ర మెమో 57ను అమలుపరుస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్ లో ఉన్న డీఏలు, సంపాదిత సెలవు బిల్లులు విడుదల చేయాలన్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. డిమాండ్ల సాధనకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న విజయవాడలో తలపెట్టిన 'చలో విజయవాడ–పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఉండాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఆర్. శ్రీనివాస నాయక్, సెక్రటరీ జనరల్ పురుషోత్తం, ఫ్యాప్టో జిల్లా సభ్య సంఘాల నాయకులు వెంకటేష్, రమణారెడ్డి, లింగమూర్తి, ఓబులేసు, లింగమయ్య, వెంకట రత్నం, రామాంజనేయులు, జయరామిరెడ్డి, అక్కులప్ప, రెహ్మాన్, సిరాజుద్దీన్, గోపాల్ రెడ్డి, జార్జ్, కులశేఖర రెడ్డి, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'సమగ్ర' సెక్టోరియల్స్ నియామకం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయానికి సెక్టోరియల్ అధికారుల నియామకం పూర్తయింది. రాజకీయ గ్రహణం, అధికారుల అలసత్వం కారణంగా ఏడాదికిపైగా ఈ పోస్టులు ఖాళీగానే ఉంటూ వచ్చాయి. పర్యవేక్షణ లేక కుంటుపడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాల దుస్థితిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. ఈ క్రమంలో నోటిఫికేషన్ ఇచ్చి, అందిన దరఖాస్తులను పరిశీలించి సీనియార్టీ జాబితా మేరకు ఇంటర్వ్యూలు చేపట్టి అభ్యర్థులను ఎంపిక చేసి ఆమోదం కోసం రాష్ట్ర కార్యాలయానికి పంపారు. ఎక్కడా సమాచారం బయటపడకుండా ఈ ప్రక్రియ అంతా గోప్యంగా ఉంచారు. నెలన్నర దాటినా నియామక ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఈనెల 23న 'అటకెక్కిన విద్యాభివృద్ధి' శీర్షికన 'సాక్షి'లో మరో కథనం వెలువడింది. దీంతో రాష్ట్ర అధికారుల్లో చలనం వచ్చింది. జిల్లా అధికారులు పంపిన జాబితాకు ఆమోదం తెలుపుతూ ఐదుగురిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేడో, రేపో వీరు విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

గందరగోళం మధ్య చిన్నారి మృతిపై విచారణ



వైద్యులను విచారణ చేస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

ఉరవకొండ: ఈ నెల 25న ఉరవకొండ సీహెచ్‌సీలో వైద్యం అందక ఐదేళ్ల బాలుడు అహరోన్‌కుమార్ మృతిచెందిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నియమించిన త్రిసభ్య కమిటీ సోమవారం చేపట్టిన తీవ్ర గందరగోళం మధ్య సాగింది. కమిటీ సభ్యులు డీసీహెచ్ఎస్ డేవిడ్ సెల్వరాజ్, డీఎంహెచ్ఓ భ్రమరాంబిక దేవి, సర్వజనాస్పత్రి చిన్నపిల్లల విభాగం వైద్య నిపుణుడు డాక్టర్ లోక్‌నాథ్‌ల వేర్వేరుగా బాధ్యులైన వైద్యాధికారి డాక్టర్ ఇస్మాయిల్, స్టాఫ్‌నర్సు ప్రియాంకతో పాటు మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులను విచారణ చేశారు. నివేదికను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌కూ విన్నవించనున్నట్లు సభ్యులు తెలిపారు.

డాక్టర్ చౌదరియే కారణం

చిన్నారి మృతి అంశంపై విచారణ సాగుతుండగానే ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ చౌదరితో జైభీమ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్పనాయక్ తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. తొలుత బాలుడిని డాక్టర్ చౌదర తన ప్రైవేట్ క్లినిక్‌లో చేర్పించుకుని చికిత్స అందిస్తూ వచ్చారని, ఆరోగ్యం విషమించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారంటూ మండిపడ్డారు. డాక్టర్ చౌదరి నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందాడంటూ ఆరోపించారు. దీంతో బాధ్యుడైన మరో డాక్టర్ డాక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. బాలుడి మృతికి తన పొరపాటు లేదని, పరిస్థితి విషమించిన తర్వాతనే ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారంటూ చెప్పబోగా, ఆయనపై బాధిత కుటుంబ సభ్యులు దాడికి యత్నించారు.

ఆర్డీటీని సమైక్యంగా కాపాడుకోవాలి

- కలెక్టర్ ఆనంద్‌కు ప్రజా సంఘాల నాయకుల వినతి



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: పేదల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థను సమైక్యంగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాసంఘాల అఖిలపక్ష కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెవెన్యూవల్ చేయని కారణంగా సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలు, పేదలకు అందిస్తున్న కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. ముఖ్యంగా వైద్య సేవలు అందక వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు చొరవ చూపి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సాకేహరి, ఎమ్మార్పీఎస్ ఓబులేసు, ఐఎంఎం బాషా, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, బేడబుడగ జంగాల సంఘం అంజి, పుసల సంఘం మధు, ఆర్డీటీ మాజీ ఉద్యోగులు గోవిందు, చంద్రాయుడు, హెల్పింగ్ హ్యాండ్స్ షబ్బీర్, నజీర్, ఎరికల సంక్షేమ సంఘం ముసలన్న పాల్గొన్నారు.

ప్రతి రోగికి మెరుగైన సేవలందించాలి

- మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం మెడికల్: చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యాధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన వరల్డ్ హార్ట్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ప్రసంగించారు. గుండె జబ్బుల నివారణపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎయిమ్స్‌లో కూడా లేని అత్యాధునిక పరికరాలు సూపర్ స్పెషాలిటీలో ఉన్నాయన్నారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ కార్డియాక్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్.. గుండె శస్త్రచికిత్సల్లో అందించిన సేవలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, జీజీహెచ్ సూపరిండెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పాల్గొన్నారు.

'ఈ–క్రాప్' నమోదు చేయాలంటూ వినూత్న నిరసన

- రోజుల తరబడి అభ్యర్థించినా మండల వ్యవసాయాధికారి స్పందించ లేదంటూ ఆవేదన
- ఈ–క్రాప్ చేయకపోతే ఏమవుతుందంటూ ఏఓ విడ్డూరపు వ్యాఖ్యలు



హావళిగి సచివాలయం ఎదుట జాతీయ జెండా పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

విడపనకల్లు: తాము సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయాలంటూ విడపనకల్లు మండలం హావళిగి గ్రామ సచివాలయం ఎదుట జాతీయ పతాకంతో రైతులు నిరసన తెలిపారు. పంటల నమోదు చేయాలంటూ పలుమార్లు వ్యవసాయాధికారి పెన్నయ్యను కోరినా ఆయన స్పందించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నమోదు ప్రక్రియ మంగళవారంతో ముగియనుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల నమోదు చేయాలంటూ అర్జీ ఇచ్చేందుకు వస్తే 'ఈ–క్రాప్ చేయకపోతే ఏమవుతుంది.. ఈ ప్రభుత్వం మరి కొన్ని రోజులు గడువు పెంచుతుందిలే' అంటూ వ్యవసాయాధికారి విడ్డూరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. అనంతరం సమస్యకు పరిష్కారం కోరుతూ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అర్జీ అందజేశారు.

వైస్ ఎంపీపీ బైక్‌కు నిప్పు



పూర్తిగా కాలిపోయిన ద్విచక్ర వాహనం

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండల వైఎస్సార్‌సీపీ నేత, వైస్ ఎంపీపీ వెంకటేష్‌నాయక్‌కు చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లికి చెందిన వెంకటేష్‌నాయక్ ఆదివారం కళ్యాణదుర్గం మండలం కాపర్లపల్లి తండాకు వేరుశనగ కాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. సాయంత్రం వేరుశనగ బస్తాలను బొమ్మగానిపల్లి తండాకు తరలించేందుకు ఆటోలు అందుబాటులో లేకపోవడంతో అదే గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంట్లోనే ఉండిపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కళ్యాణదుర్గం రూరల్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యాత్మక రైలు మార్గాల్లో అప్రమత్తంగా ఉండాలి



వీసీలో మాట్లాడుతున్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ్

గుంతకల్లు: ప్రస్తుత కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక రైలు మార్గాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలంటూ రైల్వే అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జోనల్ పరిధిలోని డీఆర్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. గుంతకల్లు నుంచి డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, అడిషనల్ జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. వర్షాల సమయంలో రైలు కార్యకలాపాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంతెనలు, సొరంగాలు, రోడ్డు అండ్ బ్రిడ్జిల వంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అప్రమత్త చర్యల్లో భాగంగా కంకర, సిమెంట్, బండరాళ్లు, ఇసుక, తదితరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రయాణికుల భద్రత, రైలు కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతపురం సబ్ రిజిస్ట్రార్‌గా ఇస్మాయిల్

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అనంతపురం అర్బన్ (రామ్‌నగర్) ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ఇస్మాయిల్‌ను నియమిస్తూ డీఐజీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. రామ్‌నగర్ జాయింట్ –2 సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న యూనస్‌ను తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేయడంతో ఆయన సోమవారం రిలీవ్ అయ్యారు. దీంతో అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇస్మాయిల్‌ను ప్రధాన కారాలయం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెండు రోజుల్లో ఆయన సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలను సీకరించనున్నారు.

తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్‌గా యూనస్

తాడిపత్రి టౌన్: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా యూనస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి డిప్యుటేషన్‌పై ఆయనను తాడిపత్రికి బదిలీ చేశారు.

రూ.26 కోట్ల వ్యాపార లక్ష్యం సాధించాలి

- డీసీఎంఎస్ మహాజనసభలో చైర్మన్ నెట్టెం వెంకటేశులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పురోభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని సొసైటీ చైర్మన్ నెట్టెం వెంకటేశులు అన్నారు. సోమవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో మహాజన సభ జరిగింది. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.24.71 కోట్లు వ్యాపార ప్రగతి సాధించామన్నారు. ఇందులో ప్రధానంగా ఎరువుల పంపిణీ ద్వారానే రూ.22.41 కోట్లకు పైగా సమకూరిందన్నారు. ఈ ఏడాది రూ.26 కోట్లు వ్యాపార ప్రగతిని సాధించడానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మహాజనసభలో అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతికతను రైతులకు చేరువ చేయండి

- ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ శారద



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డాక్టర్ శారద

కళ్యాణదుర్గం: నూతన సాంకేతికతను రైతులకు చేరువ చేసి, వ్యవసాయాన్ని సుసంపన్నం చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారద సూచించారు. కళ్యాణదుర్గం కేవీకేను సోమవారం ఆమె సందర్శించారు. కేవీకేలో ప్రయోగాత్మకంగా సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు నూతన వంగడాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జాన్సన్, కళ్యాణదుర్గం కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.చంద్రాయుడు, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనంతలో మెహబూబ్ మదాని



మేయర్ వసీం నివాసంలో మెహబూబ్ మదాని, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: 'జమాతే ఉలేమా ఏ హింద్' జాతీయ అధ్యక్షుడు మెహబూబ్ మదాని సోమవారం నగరానికి వచ్చారు. మేయర్ వసీం నివాసానికి ఆయన వెళ్లారు. మేయర్ నివాసంలో దువా ఆచరించారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేకంగా దువా చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీంతో ఆయన మాట్లాడారు. మెహబూబ్ మదానిని వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో ఆధ్యాత్మిక భావన పెరగాలి

అనంతపురం కల్చరల్: నైతిక విలువలను పెంచే ఆధ్యాత్మిక భావనను యువత పెంపొందించుకోవాలని నగర మేయర్ వసీం అన్నారు. వారం రోజులుగా స్థానిక కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి ఆలయం వేదికగా సాగుతున్న భాగవత సప్తాహం సోమవారం రాత్రి ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకల్లో మేయర్ వసీం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విపరీతంగా పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానం మంచి చేస్తున్నా యువతను చెడగొట్టే అనేక కార్యక్రమాలతో పెడత్రోవ పట్టిస్తోందన్నారు. భక్తిభావం పెరిగితే నైతికత వైపు మళ్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. భాగవత, రామాయణ పారాయణం చేయించిన నిర్వాహకులను, ఆధ్యాత్మికవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమలభూషణ్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అనంతపురం అర్బన్: ఐ మిత్ర విజన్ సెంటర్ సౌజన్యంతో సీపీఎం నగర కమిటీ సోమవారం స్థానిక ఆరవ రోడ్డులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఐ మిత్ర విజన్ సెంటర్ వ్యవస్థాపకుడు పులిపాటి గోపాల్, కో ఆర్డినేటర్ నాగరాజు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలు ఉన్న పది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కళ్లను సంరక్షించుకోవాలన్నారు. అధికంగా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. యోగా, వ్యాయామాన్ని దినచర్యలో తప్పనిసరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రామాంజినేయులు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సాదిక్‌వలి

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ పంతుల కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాఫియా సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాదిక్ వలి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రుద్రంపేట ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..?

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని వెంగమనాయుడు కాలనీలో కొన్ని రోజుల నుంచి చెత్త తరలించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త తరలింపు విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చూపుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఓ జ్యోతు విజయ్‌కుమార్

ఆత్మకూరు: ఈ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ సిబ్బంది వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతు విజయ్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఇంకా నమోదు చేసుకోని రైతులు ఉంటే వారికి సమాచారం అందించి వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా పైపుపై నడుస్తూ..

ఈత.. జాగ్రత్త!

నగర సమీపంలోని హెచ్చెల్సీలో ఇటీవల నీళ్లు పారుతున్నాయి. దీంతో కాలువలో ఈత కొట్టేందుకు పిల్లలు ఉత్సాహం చూపుతున్నారు.అయితే, ప్రమాదకరంగా పైపులపై నడుస్తూ ఉండడం, ఎలా పడితే అలా దూకుతుండడం ఆందోళన కలిగిస్తోంది. పైపులపై నుంచి ఏ మాత్రం పట్టు జారి కిందపడినా తీవ్ర గాయాలపాలవ్వాల్సిందే. ఈ క్రమంలో పిల్లలు జాగ్రత్తలు పాటించాలని పలువురు సూచిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





దిమ్మెలపై కూర్చుని కాలువలోకి దూకుతున్న పిల్లలు

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ



వైద్య కళాశాల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

అనంతపురం మెడికల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ సూచించారు. ప్రపంచ హార్ట్ డేను పురస్కరించుకుని సోమవారం వైద్య కళాశాల నుంచి జెడ్పీ వరకు ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధూమపానం, మద్యం, గుట్కా తదితరాలు మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. జంక్ ఫుడ్‌తో విపరీతంగా బరువు పెరిగి ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడిక్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ చిన్నవయసులోనే ఎంతో మంది గుండె సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు ప్రాణాలు విడిచిన పరిస్థితులను చూస్తున్నామన్నారు. 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ బీమసేనాచార్, డాక్టర్ భాస్కర్, న్యూరో సర్జన్ డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్–సవీర ఆధ్వర్యంలో ర్యాలీ:
కిమ్స్–సవీర ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు.టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ఆస్పత్రి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ బాలకిషోర్, డాక్టర్ సందీప్, ఆస్పత్రి సీఓఓ సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కాటికాపర్ల సంఘం, కేవీపీఎస్ నాయకులు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలంటూ కాటికాపర్ల సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు, కాటికాపర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, కాటికాపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. వృత్తిదారులందరినీ నాల్గో తరగతి ఉద్యోగులుగా నియమించి భృతి కల్పించాలన్నారు. చెలక, పార, గ్లౌజులు, బూట్లు, హెడ్‌లైట్, చేతికర్ర ఉచితంగా ఇవ్వాలన్నారు. ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. శ్మశానంలో మరణం నమోదు చేసుకోవడానికి ఇద్దరికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు రామునాయక్, జీవా, ఆనంద్, ఖాసీమ్, పెద్ద లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోండి



ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం టౌన్: విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆర్వీ నాయుడు మాట్లాడుతూ ఈనెల 20న హంపాపురం సబ్ స్టేషన్ పరిధిలో వలస కార్మికుడు ఎస్కే బసి విద్యుత్ షాక్‌కు గురయ్యాడన్నారు. 6 రోజుల పాటు చికిత్స పొందుతూ ఈ నెల 26న మృతి చెందాడన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఘోరం జరిగిందన్నారు. వెంటనే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.15 లక్షలు ఇవ్వడంతోపాటు రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. 15 రోజుల్లో తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగమణి, రామాంజినేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, శంకర్, చెన్నప్ప, ఆదెప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీవారు



గజవాహనంపై లక్ష్మీ వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రామనగర్, హౌసింగు బోర్డు, శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరాలయాలలో శ్రీవారు విశేష అలంకారంలో పూజలందుకున్నారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనం గోవిందనామస్మరణతో ఆలయ పరిసరాలను మార్మోగించారు. స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు ఆలయ ప్రాకారోత్సవంలో గజ వాహనంపై దర్శనమిచ్చి భక్తులను ఆనంద పరవశులను చేశారు. అర్చకులు, హరికిషోర్ శర్మ తదితరులు మూలానక్షత్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురవీధుల గుండా రాత్రి వాహన సేవలు సాగుతున్నప్పుడు భక్తబృందాలు నామసంకీర్తనలతో ఆకట్టుకున్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన అనిల్‌కుమార్ గౌడ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక 50వ డివిజన్‌లో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దసరాను పురస్కరించుకుని ఏటా కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శ్యామల, సామాజికవేత్త వీకే రంగారెడ్డి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు షేకన్న, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, నాయకులు పుల్లారెడ్డి, నరేంద్ర, మహేష్, రఫి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకే అధికారాలు బదలాయించండి



అధికారులకు విన్నవిస్తున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్యాంసుందర్

రాప్తాడురూరల్: బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ అధికారాలు పంచాయతీలకే బదలాయించేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం రూరల్ మండలం పాపంపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్యాంసుందర్ కోరారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఆర్థిక వనరులు తక్కువగా ఉండడం వల్ల, పంచాయతీల పరిధిలో ప్రాథమిక అవసరాలైన ఉద్యోగులకు జీతాల చెల్లింపు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులు, నీటి సరఫరా, బోర్లు/పైప్‌లైన్ నిర్వహణ తదితరాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గతంలో పంచాయతీలకు ఆదాయాన్ని అందించే 'బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్' అధికారాలు గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేవన్నారు. ఇటీవల అహుడా పరిధిలోకి బదిలీ చేయడంతో ఆదాయ వనరులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక శక్తినీ, అభివృద్ధినీ ప్రోత్సహించేందుకు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ అధికారాలు తిరిగి గ్రామ పంచాయతీలకే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.



భక్తులతో కిక్కిరిసిన కొత్తూరు అమ్మవారి శాల



ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

సరస్వతీ నమస్తుభ్యం

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ప్రధాన ఘట్టాలు సోమవారం నుంచి ఘనంగా ఆరంభమయ్యాయి. మూల నక్షత్రం రావడంతో వాడవాడలా అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవిగా అవతరించి భక్తులను బ్రోచారు. స్థానిక రెండో రోడ్డులోని శ్రీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకార సేవలు, చండీహోమం, గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవార్ల ఆలయాల్లో వాసవీమాతను సరస్వతీ మాతగా సర్వాంగ సుందరంగా అలంకరించి ఆరాధించారు. హెచ్చెల్సీ కాలనీలోని శ్రీనసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖర బాబు నేతృత్వంలో జరిగిన సామూహిక అక్షరాభ్యాసాల్లో అనేక మంది విద్యార్థులకు పలకలు, బలపాలు, అమ్మవారి చిత్రపటాలనందించారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో పార్వతీదేవి అలంకారంలో, తపోవనం వేద మాత గాయత్రి ఆలయం, శ్రీశివబాలయోగి ఆశ్రమం, శారదా శృంగేరీ శంకర మఠం తదితర చోట్ల అమ్మవారు చదువుల తల్లి సరస్వతీమాత అలంకారంలో పూజలందుకున్నారు. అర్బన్ బ్యాంకు ఎదురుగా కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్యను బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ సత్కరించారు.

సరస్వతీ దేవి కటాక్షించు!
రాప్తాడు/ఆత్మకూరు: రాప్తాడులోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పార్వతీ దేవి ఎనిమిదో రోజు సోమవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మకూరులో రేణుకా యల్లమ్మ, వాసవీ మాతకు, వడ్డుపల్లిలో సుంకులమ్మకు, పంపనూరులో పార్వతీదేవికి పూజలు నిర్వహించారు.







కొత్తూరు, పాతూరులో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తురాలు



శివబాలయోగి ఆశ్రమంలో





తపోవనంలో వేదమాత గాయత్రిదేవి, మొదటిరోడ్డు శివాలయంలో ..



రాప్తాడులో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



ఆత్మకూరులో రేణుకా యల్లమ్మ

రైతు కుటుంబానికి సాయం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కుంటెన్న బంధువులు

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామానికి చెందిన రైతు కుంటెన్న (38) ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుంటెన్నకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కుంటెన్న బంధువులు నాగరాజు, ఓబుళపతి, ఎర్రమ్మ, ఎర్రిస్వామి తదితరులు సోమవారం తహసీల్దార్ లక్ష్మినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంటెన్న వ్యవసాయ పనుల కోసం రూ.10 లక్షల దాకా అప్పులు చేశాడని, వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అతని కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం చేయాలని కోరారు.